సాక్షి ఒడిశా

మంగళవారం । 18 । జూలై । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,94,637లు, బంగారం 3.58 గ్రాములు, వెండి 7.64గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



భంభం భోలే..

- నందడిగా భోల్‌భం దీక్షలు

-IIలో



లక్ష్మీపూర్‌లో ప్రజా స్పందన

-IIలో

న్యూస్‌రీల్

ఈకో రైల్వే పీసీఎస్‌సీగా అలోక్ బ్రహ్మ



భువనేశ్వర్: ఈస్ట్‌కోస్ట్ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్(పీసీఎస్‌సీ)గా అలోక్ బ్రహ్మ బాధ్యతలు స్వీకరించారు. 1997 బ్యాచ్ ఐఆర్‌పీఎఫ్ అభ్యర్థిగా భారతీయ రైల్వేలో చేరారు. ఈ నియామకానికి ముందు రైల్వేశాఖ భారత ప్రభుత్వరంగ సంస్థ ముంబై రైల్వే వికాస్ కార్పొరేషన్ లిమిటెడ్‌లో జనరల్ మేనేజర్‌గా(ఏఅండ్ఎస్)గా డిప్యూటేషన్‌పై పని చేశారు. రైల్వే రక్షక దళంలో పలు ఉన్నత పదవుల్లో కీలక బాధ్యతలు విజయవంతంగా నిర్వహించారు. 2018లో విశిష్ట సేవలతో ఇండియన్ పోలీస్ మెడల్, 2005లో డైరెక్టర్ జనరల్(ఆర్‌పీఎఫ్) విశిష్ట పురస్కారం అందుకున్నారు. విధి నిర్వహణ రంగంలో అంకిత భావంతో పలు ఉన్నత స్థాయి పురస్కారాలు అందుకొని, సత్కారం పొందారు.

ఆర్థికంగా ఆదుకునేందుకు కృషి



సమావేశంలో కాపు సంఘం సభ్యులు

జయపురం: రాష్ట్రంలో ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన కాపు సామాజికవర్గ ప్రజలను ఆదుకునేందుకు శక్తివంచన లేకుండా కృషి చేయాలని సంఘం సభ్యులు పిలుపునిచ్చారు. జయపురం టౌన్ హాలులో కె.శ్రీనివాసరావు ఆహ్వానం మేరకు కొరాపుట్ జిల్లా కాపు సంఘం సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని సామాజిక వర్గ స్థితిగతులపై చర్చించారు. 300లకు పైగా కుటుంబాలు ఉన్నాయని, వారిలో ఆర్థికంగా వెనుకబడిన వారిని గుర్తించి, ఆదుకోవాలని నిర్ణయించారు. సమావేశంలో కొట్‌పాడ్ నోటిఫైడ్ ఏరియ కౌన్సిల్(ఎన్ఏసీ) చైర్మన్ ఎం.శంకరరావు, న్యాయవాది కె.ప్రసాదరావు, ప్రముఖ వ్యాపారి బి.రామ్‌ప్రసాద్, ఎ.గోపాలరావు పాల్గొన్నారు.

పట్టుబడిన నిందితులు

బరంపురం: నగర శివారు బొనపల్లి గ్రామంలో ఈనెల 4న జరిగిన మాజీ సర్పంచ్ ప్రశాంత్ స్వాయిపై హత్యాయత్నం చేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశామని బరంపురం ఎస్పీ సరవణ్ వివేక్ సోమవారం తెలిపారు. బరంపురం జిల్లా పోలీసు, దిగపండి పోలీసు స్టేషన్ పరిధి బొనపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ ప్రశాంత్ స్వాయిపై ప్రత్యర్థివర్గం దుండగులు మారణాయుధలతో దాడి చేశారు. వారి నుంచి ప్రాణాలతో బయటపడ్డారు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు వీరు బొనపల్లి గ్రామానికి చెందిన నందన్ బెహరా, సుకుండా గ్రామనికి చెందిన శంకర్ గౌడాగా గుర్తించారు. వారి నుంచి కత్తి, సెల్‌ఫోన్, బైక్ స్వాధీనం చేసుకున్నారు.

కళ్ల కలం

- భయం గొలుపుతున్న కంటి వ్యాధులు
- రాయగడ, జయపురంలో విస్తరిస్తున్న కళ్ల కలకలు
- వాతావరణ మార్పులతో మరింత వ్యాప్తి
- జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్న వైద్యులు



జయపురం జిల్లా కేంద్రాస్పత్రిలో చిన్నారిని పరీక్షిస్తున్న నేత్ర వైద్యులు



వ్యాధిబారిన పడిన విద్యార్థి

రాయగడ/జయపురం: వాతావరణ పరిస్థితులు మారిన క్రమంలో సీజనల్ వ్యాధులతో పాటు కళ్ల కలకలు కలవరం పెడుతున్నాయి. జయపురం, రాయగడలో గత వారం రోజులుగా సగటును రోజుకు 100కు పైగా కేసులు నమోదవుతున్నాయి. దీనినే 'పింక్ ఐ'గా కూడా పిలుస్తారు. అయితే ఇది ప్రమాదకరం కాకున్నా.. అంటువ్యాధి కావడంతో సోకిన 3, 4 రోజులు అవస్థలు తప్పవు. కళ్ల వాపు, నొప్పి, ఎరుపెక్కి దురదగా అనిపించడం, కళ్లల్లో ఇసుక వేసినట్లు తీవ్రమైన మంటగా ఉండటం దీని ప్రధాన లక్షణం. అడినో అనే వైరస్ వల్లే ఇది వ్యాప్తి చెందుతుంది. రుతువులు మారే రోజుల్లో సాధారణంగా వాతావరణంలో ఉష్ణోగ్రత పెరిగి, వేడిగాలులు వీచే సమయంలో, శీతాకాలంలో ఎక్కువగా ఇది ప్రబలుతుంది. వాతావరణంలో దుమ్ము, ధూళి వల్ల అతి సులభంగా అలర్జీ ఏర్పడుతుంది. దీంతో కళ్లకు జిల వస్తుంది. రుద్దితే కళ్ల ఎర్రగా మారి వాచిపోతాయి. కళ్లల్లో కొన్నిసార్లు నీరు కారుతూనే ఉంటుంది. వ్యాధి తీవ్రంగా ఉంటే కళ్ల నుంచి చీము వంటి ద్రవం కూడా కారుతుంది. నిద్ర లేచినప్పుడు కళ్ల తెరవలేని పరిస్థితి ఏర్పడుతుంది. తీవ్రత ఎక్కువగా ఉంటే కంటి వైద్యులను సంప్రదించడం మేలు.

అవగాహన తప్పనిసరి..

ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు ఎంతోమంది కంటి వ్యాధులతో చికిత్స నిమిత్తం వస్తుండగా.. వీరిలో దాదాపు 90శాతం మంది కళ్ల కలకలతో వస్తున్న వారే ఉన్నారని జయపురం జిల్లా కేంద్రాస్పత్రి కంటి వైద్య నిపుణులు డాక్టర్ దేవాశిశ్ మహాపాత్రొ, రాయగడ జిల్లా ఆస్పత్రి వైద్యులు సురేష్‌కుమార్ తెలిపారు. అలాగే మార్కెట్‌లో కంటి మందులు, డ్రాప్స్ విరివిగా అమ్ముడు పోతున్నాయన్నారు. ఒక్కసారిగా వర్షాలు, తీవ్ర ఎండ తదితర కారణాలతో ఏటా జూన్ మాసంతం, జూలైలో ఎక్కువగా కంటి వ్యాధులు విస్తరిస్తున్నట్లు అభిప్రాయం వ్యక్తంచేశారు. స్థానిక ఆస్పత్రిలో రోగులకు ఉచిత వైద్యం, మందులు సమకూర్చుతున్నట్లు వెల్లడించారు. అలాగే మిగతా రోగులు, గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేస్తూ.. వ్యాధి ఇతరులకు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బంది అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు.

నియంత్రణ ఇలా..

నేరుగా కళ్లతో చూస్తే ఈ వ్యాధి అంటుకోదు. చేతులను తాకడం ద్వారా సోకుతుంది. కనుక తరచూ చేతులను సబ్బుతో కడగడం మంచిది. టిష్యూ పేపర్‌ను ఉపయోగించడం శ్రేయస్కరం. ఇతరులకు సోకకుండా ఉండేందుకు కళ్లకు నల్లటి అద్దాలను ధరిస్తే మంచిది. అప్పుడప్పుడు చల్లటి నీటితో కళ్లను శుభ్రపరచాలి. వైద్యుల సూచన మేరకు ఐ డ్రాప్స్ వేస్తే మంచిది.

ముందస్తుగా చర్యలు..



పట్టణంలో కలకల ప్రభావం ఉంది. నిత్యం 50మంది వరకు రోగులు చికిత్స నిమిత్తం వస్తున్నారు. వ్యాధి సంక్రమించిన అనంతరం, సంక్రమించక ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలుసుకోవాలి. కళ్లను చేతితో తాకడం ద్వారా వ్యాధి మరింత ఎక్కువయ్యే ప్రమాదం ఉంది. ఇటువంటి సమయంలో తెల్లటి వస్త్రంతో తరచూ శుభ్రం చేసుకోవాలి. రోజూ ఆ వస్త్రాన్ని డెటాల్‌తో శుభ్రపరిచిన అనంతరం తిరిగి వాడవచ్చు. అలాగే వ్యాధి సోకిన సమయంలో మాంసాహారం తీసుకోకూడదు. జిల్లాలో గిరిజన గ్రామాలు ఎక్కువగా ఉండటంతో మూఢ నమ్మకాలు, నాటువైద్యం చేయించుకుని మరింత అస్వస్థతకు గురవుతున్నారు. హోమియో చికిత్స వారికి ఎంతో మేలు చేస్తుంది.

– డాక్టర్ ప్రేమ్‌కుమార్, హోమియో వైద్యులు, రాయగడ



రాయగడ ప్రభుత్వ ఆస్పత్రిలో నేత్ర విభాగం వద్ద బారులు తీరిన రోగులు

సరుకు రవాణాలో రికార్డు



గోపాల్‌పూర్ పోర్టులో కార్గో లోడింగ్

- 59,150 మెట్రిక్ టన్నుల ఇనుప ఖనిజం లోడ్ చేసిన గోపాల్‌పూర్ పోర్టు

భువనేశ్వర్: రాష్ట్రంలో అత్యంత లోతైన ఆల్ వెదర్ ఓడరేవుగా పేరొందిన గోపాల్‌పూర్ పోర్ట్ అత్యంత వేగంగా 24 గంటల్లో 59,150 మెట్రిక్ టన్నుల ఇనుప ఖనిజం లోడ్ చేసి రికార్డు నెలకొల్పింది. జేఎస్‌డబ్ల్యూ స్టీల్‌కు చెందిన ఎంవీ రీచీ స్ప్రింగ్ ఓడలో ఈ సరుకు లోడు చేసినట్లు పోర్టు అధికార వర్గాలు సోమవారం వెల్లడించాయి. ఈనెల 15న 40 గంటల్లో 86,700 మెట్రిక్ టన్నుల ఇనుప ఖనిజం ఓడరేవులో లోడ్ చేయడం ద్వారా గంటకు సగటున 2,167 మెట్రిక్ టన్నుల లోడింగ్‌తో రికార్డు సృష్టించింది. ఈ మేరకు అనుబంధ వర్గాలు ప్రసంశలు కురిపించారు. కార్గో రికార్డ్ స్థాయి లోడింగ్ ఓడరేవు నిర్వహణ సమర్థత, సామర్థ్యానికి అద్దం పడుతుందని ఎస్‌పీ పోర్ట్ మెయింటెనెన్స్ మేనేజింగ్ డైరెక్టర్ అమిత్ సబూ తెలిపారు. గోపాల్‌పూర్ ఓడరేవు వినియోగదారులకు అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తోందన్నారు. ఓడరేవుకు చేరే ముందుకు ప్రణాళికయుతమైన ఏర్పాట్లు చేసి రక్షణ, నిర్వహణ కార్యాచరణను పకడ్బందీగా నిర్వహిస్తోందని పోర్టు లిమిటెడ్ సీఈఓ వి.జనార్దనరావు ప్రకటించారు. రాష్ట్రంలో అత్యుత్తమ రైలు, రోడ్డు అనుసంధాన నౌకాశ్రయంగా కార్గో నిర్వహణలో నిరంతరం కొత్త రికార్డులను నెలకొలిపే లక్ష్యంతో కృషి చేస్తుందన్నారు. ఇటీవల ఎంవీ న్యూ ప్రెస్టీజ్ నౌక నుంచి 24 గంటల్లో 32,000 మెట్రిక్ టన్నుల బొగ్గు అన్‌లోడ్ చేసినట్లు వివరించారు.

భారీ కార్గోలను నిలిపేందుకు..

నిత్యం 20కి పైగా ర్యాక్‌లను నిర్వహించగలిగే సత్తా కలిగిన ఈ ఓడరేవు సమీప ప్రత్యర్థి వర్గాల పోటీని ధీటుగా ఎదుర్కొంటోందని సీఈఓ జనార్దనరావు పేర్కొన్నారు. ఈ ప్రయత్నం సముద్ర మార్గంలో సరుకు రవాణా రంగంలో ముందంజలో నిలుస్తుందన్నారు. 2017 నుంచి షాపూర్జీ పల్లోంజీ గ్రూప్ ఆధ్వర్యంలో గోపాల్‌పూర్ పోర్ట్ 14.5 మీటర్ల లోతున నిలిచే నౌకలకు అనుకూల వనరులను నిరవధికంగా కల్పించి, రికార్డు స్థాయి కార్యకలాపాలను ప్రోత్సహిస్తోందని తెలిపారు. దాదాపు 2.5 మెట్రిక్ టన్నుల కార్గోను నిల్వ చేసేందుకు ఓపెన్, క్లోజ్డ్ స్టోరేజ్ స్పేస్‌ను ఓడరేవు కల్పిస్తుందన్నారు. వినియోగదారుల అంచనా మేరకు పలు స్థాయిల్లో సరుకు రవాణాకు ఎల్లవేళలా సదుపాయాలు అందుబాటులో ఉంటున్నాయని స్పష్టంచేశారు. దీంతో బహుళ కార్గోలను సమర్థవంతంగా నిర్వహించడంలో గోపాల్‌పూర్ పోర్టు సాఫల్యం సాధిస్తుందని విశ్వాసం వ్యక్తంచేశారు. ఈ మేరకు ఓడరేవులో 8ఆపరేషనల్ రైల్ యార్డ్ సైడింగ్‌లు ఉన్నాయన్నారు. పారా దీప్, విశాఖపట్నం ఓడరేవుల మధ్య గోపాల్‌పూర్ ఓడ రేవు నెలకొని ఉండడం కలిసి వచ్చిన అవకాశంగా వివరించారు. ఈ అనుకూలత భారతదేశ తూర్పు తీరంలో దిగుమతులతో పాటు తీరప్రాంత సరుకుల రవాణా కోసం ప్రత్యేకంగా దోహదపడుతుందని ఆకాంక్షించారు.

ప్రతి పంచాయతీకి రూ.50 లక్షలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మినీ దియాన్

జయపురం: గ్రామీణ ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా 'అమో ఒడిశా–నవీన ఒడిశా' పథకాన్ని ప్రకటించడంతో పాటు ప్రతి పంచాయతీకి రూ.50 లక్షల నిధులను రాష్ట్రప్రభుత్వం విడుదల చేయనుందని కొట్‌పాడ్ ఎమ్మెల్యే పద్మినీ దియాన్ వెల్లడించారు. కొట్‌పాడ్‌లో సోమవారం జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నిధులను పంచాయతీలు స్వతంత్రంగా అభివృద్ధి పనులకు వెచ్చించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా స్వతంత్ర వికాశ పరిషత్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖర మాఝి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రజల సంక్షేమానికి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారని వివరించారు. సమావేశంలో బొయిపరిగుడ సమితి చైర్మన్ ప్రశాంత గుప్తా, బీజేడీ పర్యవేక్షకులు సూర్య నారాయణ రథ్, సహాయ పర్యవేక్షకులు నారాయణ బిశాయి, కొట్‌పాడ్ సమితి చైర్‌పెర్సన్ కమలా, జిల్లా పరిషత్ సభ్యులు త్రిపతి చలాన్, గీతా మాఝి, బీజేడీ నాయకులు సావిత్రి మాఝి, ప్రశాంత బక్షీ, త్రిపతి బాలాజీ మహంతి, సుధీర్‌చంద్ర హమంతి తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ దొంగల అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితులు

బరంపురం: నగర పరిసరాల్లో చోరీలకు పాల్పడి, అలజడి సృష్టిస్తున్న ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్‌డీపీఓ అశ్వినీకుమార్ అందించిన సమాచారం ప్రకారం బరంపురం జిల్లా పోలీసు, సదర్ పోలీస్ స్టేషన్ పరిధిలని వివిధ కాలనీల్లో మోటార్ పంపుసెట్లు, సీసీ కెమెరాలు దోపడీకి గురవ్వడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేయడంతో పాటు ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. వీరు అదే ప్రాంతానికి చెందని గౌరవ దాస్, బంటి దాస్‌గా గుర్తించామని ఎస్‌డీపీఓ వెల్లడించారు. నిందితుల నుంచి చోరీ సొత్తు రికవరీ చేయడంతో పాటు సోమవారం ఉదయం కోర్టులో హాజరు పరిచామన్నారు.

భక్తిశ్రద్ధలతో చౌడేశ్వరి పూజలు



కుంకుమ పూజలు నిర్వహిస్తున్న మహిళలు

రాయగడ: పట్టణంలోని స్వాగత్ లైన్ రామలింగేశ్వర మందిర ప్రాంగణంలో ఉన్న దేవాంగుల ఆరాధ్యదైవం చౌడేశ్వరి అమ్మవారి పూజలు సోమవారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా అమ్మవారి విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించి, అనంతరం రామలింగేశ్వర మందిరంలో నిలిపారు. ఈ సందర్భంగా మహిళలు కుంకుమార్చలు జరిపారు. గత 37 ఏళ్లుగా ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నామని దేవాంగుల సంఘం సభ్యులు తెలిపారు.

ఘనంగా సహస్ర లింగార్చన..

బరంపురం: స్థానిక మార్తపేట వీధిలో నిర్వహిస్తున్న చౌడేశ్వరి అమ్మవారి 44వ వార్షిక ఉత్సావాల్లో భాగంగా సిద్దేశ్వర స్వామి కల్యాణ మండపం ప్రాంగణంలో సహస్ర లింగార్చన పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు నేతేటి ఉమమహేశ్వర శర్మ పర్యవేక్షణలో సామూహిక శ్రీచక్ర, రుద్రాభిషేక, శివారాధన పూజలు జరిపారు. అలాగే సుప్రభాత సేవ, దేవతార్చన, బాలభోగం, హోమం, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం సంధ్యాకాలార్చన, మంగళహారతి, వేదస్వస్తి చేపట్టారు. కార్యక్రమంలో కల్యాణ మండపం చైర్మన్ తూతిక గోపి, దేవాంగ సంఘం అధ్యక్షుడు కొల్లా లక్ష్మణరావు, పూజా కమిటీ చైర్మన్ దేవి తారబాబు తదితరులు పాల్గొన్నారు.



బరంపురం: పూజల్లో పాల్గొన్న కమిటీ ప్రతినిధులు

ఊరూ వాడా.. వన మహోత్సవాలు

- మొక్కలు నాటిన విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు



మొక్కలు నాటుతున్న విద్యార్థులు, సీవా సభ్యులు

జయపురం: వన మహోత్సవాల్లో భాగంగా వివిధ ప్రాంతాల్లో స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు సోమవారం మొక్కలు నాటారు. ఇందులో భాగంగా జయపురం రోటరీ క్లబ్ మిషన్ గ్రీన్, కేశవ సేవా ట్రస్ట్ సంయుక్తంగా శారదా శిశుమందిర ప్రాంగణంలోఈ కార్యక్రమం చేపట్టారు. రోటరీ ఫ్రైడ్ అధ్యక్షుడు అశోక్ మిశ్రా, కార్యదర్శి సురేష్ పాణిగ్రహి, సభ్యులు రామహరి పండా, టునా దాస్, రబినారాయణ నందా, రామచంద్ర సాహు, శ్రీబ్రహ్మ, రత్నాకర చౌధురి, కిశోర్ పండా, పంకజ పాత్రొ, శారదా శిశుమందిర అధ్యాపకులు మను గురూజీ, రామ గురూజీ, తదితరులు పాల్గొన్నారు. అలాగే జయపురం సమితి టంకువ గ్రామ జగన్నాథ్ మందిర ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో హస్‌తెరువ గ్రూపు సభ్యులు ధీరెన్ హోహణ పట్నాయక్ మాట్లాడారు. చెట్లు బతికితేనే జీవరాసుల మనుగడ సాధ్యమని, ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. సభ్యులు రామనాథ్ త్రిపాఠి, గోపాలకృష్ణ సామంతరాయ్, రంజిత్ పాఢి, జితు మిశ్రా, పెంద్ర ప్రసాద్ హిశ్రా, ప్రదీప్ భట్, మనోజ్ మాఝి, బసంతి జెనా, సాగరిక పట్నాయక్, భారతీ బిశాయి, సబిత త్రిపాఠి, పింకి శత్పతి, పంకజా పాత్రొ తదితరులు పాల్గొన్నారు.

కొట్‌పాడ్‌లో..

సంబాద్ సాహిత్య ఘర్–అటవీ విభాగం సంయుక్తంగా కొట్‌పాడ్ లోని వివిధ ప్రాంతాల్లో వన మహోత్సవాలు నిర్వహించారు. కొట్‌పాడ్ కోర్టు ఆవరణలో, ఆదర్శ పాఠశాల, ఎస్ఎస్ డిజి స్కూల్, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ దిలీప్ కుమార్ బారిక్, సంబాద్ సాహిత్య ఘర్ అధ్యక్షుడు గణేష్ పండా, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మణిప్రసాద్ పట్నాయక్, మాజీ అధ్యక్షుడు పంకజ పాత్రొ, కార్యదర్శి శంకర పండా, ఉపాధ్యక్షుడు ప్రదీప్ భక్షి, పారాలీగల్ సభ్యులు హేమంత పాత్రొ, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు. జయపురం పూల్‌బెడ లోని విజ్ఞాన ఇంటర్నేషనల్ విద్యాలయంలో వన మహోత్సవం నిర్వహించారు. అధ్యక్షుడు ప్రకాష్‌కుమార్ నాయక్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో స్వామినాథన్ ఫౌండేషన్ శాస్త్రవేత్త ఆర్.జీవ తదితరులు పాల్గొని, ఔషధ మొక్కలు నాటారు. కార్యక్రమంలో విద్యాలయ డైరెక్టర్ విశ్వరంజన్ సాహు, ప్రిన్సిపాల్ జగన్నాథ మిశ్రా, వైస్ ప్రిన్సిపాల్ దేవాశిశ్ బ్రహ్మ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీవా ఆధ్వర్యంలో..

జయపురం: స్వచ్ఛంద సంస్థ సోషియల్ ఎడ్యుకేషనల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ అసోసియేషన్(సీవా) సభ్యులు జి.వెంకటరెడ్డి ఆధ్వర్యంలో బొయిపరిగుడ సమితి గుమ్మ గ్రామంలోని ఒడిశా ఆదర్శ పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు విశాల పట్నాయక్, విద్యార్థులు 200 లకు పైగా మొక్కలు నాటారు. జీవరాశి మనుగడకు చెట్లే ఆధారమని, ప్రతి విద్యార్థీ తమ పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటి, వాటిని పరిరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుభ్రత్‌కుమార్ జెనా, సీవా అధ్యక్షుడు సుధాకర పట్నాయక్, కార్యదర్శి సౌమ్యరంజన్ దొళాయి, ఉపాధ్యాయులు విష్ణుజిత్ మిశ్రా, సహాయ కార్యదర్శి గోపాల సాహు, కోశాధికారి రంజిత్ సాహు, మాజీ కార్యదర్శి ప్రతాప్ పట్నాయక్, సభ్యులు కృష్ణచంద్ర దాస్, రమేష్ పట్నాయక్, బినాయక మహాపాత్రొ, ఫణిభూషణ తివారి, రవీంద్రనాథ్ సాహు, జి.శివ, ముఖేష్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

అందరి బాధ్యత..

రాయగడ: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతగా తీసుకోవాలని, కేవలం మొక్కలు నాటి వదిలేయకుండా వాటి సంరక్షణ చర్యలు కూడా తీసుకోవాలని ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు సుభాష్‌చంద్ర సూర్య అన్నారు. జిల్లాలోని జిమిడిపేట రైల్వేస్టేషన్ ప్రాంగణంలో ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో వన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు, అటవీశాఖ సిబ్బంది సంయుక్తంగా వివిధ రాకాల మొక్కలు నాటారు. ఏటా వర్షాకాలంలో తమ క్లబ్ తరుపున ఇటువంటి కార్యక్రమాలను చేపడుతున్నట్లు కార్యదర్శి శివప్రసాద్ గౌడొ తెలిపారు. కార్యక్రమంలో రైల్వేస్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విజ్ఞాన్ పాఠశాలలో వన మహోత్సవంలో సిబ్బంది



రాయగడ: మొక్కలు నాటుతున్న గౌడొ, సిబ్బంది

పూరీ హుండీ లెక్కింపులో దొంగతనం

- నిందితుడు ఆలయ పరిపాలనా విభాగంలో గుమస్తా



శ్రీమందిరం హుండీ ఆదాయాన్ని, లెక్కిస్తున్న దృశ్యం



నిందితుడు సుశాంత రౌత్రాయ్

భువనేశ్వర్: పూరీ జగన్నాథ దేవాలయం హుండీ లెక్కింపులో దొంగతనం చోటు చేసుకుంది. ఆలయ ఆదాయం లెక్కింపు ప్రక్రియలో పాలుపంచుకున్న సిబ్బంది ఈ తప్పిదానికి పాల్పడినట్లు సీసీటీవీ నిఘాలో బట్టబయలైంది. స్వామి విరాళ హుండీలో పోగైన సొమ్ము నుంచి రూ.800 దొంగిలించినట్లు కనుగొన్నారు. ఈ వ్యవహారంలో నిందితుడిని అరెస్ట్ చేసి, కోర్టుకు తరలించారు. నిందితుడు జగన్నాథ ఆలయ పరిపాలనా కార్యాలయంలో గుమస్తాగా పని చేస్తున్న సుశాంత్‌కుమార్ రౌత్రాయ్‌గా గుర్తించారు. శనివారం నిర్వహించి ఆలయ హుండీ లెక్కింపు పనిలో సుశాంత్‌ని నియమించారు. ఈ పని పూర్తికాక ముందే అక్కడి నుంచి బయటకు వెళ్లిపోయాడు. ఈ కదలిక అనుమానస్పదంగా భావించిన తోటి లెక్కింపు కార్యకర్తలు సీసీటీవీ కెమెరా ఫుటేజ్‌ని క్షుణ్ణంగా పరిశీలించడంతో రౌత్రాయ్ లెక్కింపు సమయంలో సొమ్మును ప్యాంటు జేబులో పెడుతున్నట్లు కనిపించింది. విచారణ చేపట్టి దొంగతనానికి పాల్పడినట్లు నిర్ధారించడంతో సింహద్వారం ఠాణాలో పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. సోమవారం ఉదయం పూరీ కోర్టులో హాజరు పరిచారు.

క్లుప్తంగా

'జగనన్న తోడు'కు సిద్ధం

శ్రీకాకుళం పాతబస్టాండ్: చిరు వ్యాపారులను ఆదుకునేందుకు అమలు చేస్తున్న జగనన్న తోడు ఏడో విడత కార్యక్రమం మంగళవారం నిర్వహించనున్నారు. ఈ పథకం ద్వారా చిరు వ్యాపారులకు, సంప్రదాయ వృత్తిదారులకు రూ.10 వేలు వడ్డీ లేని రుణం అందజేస్తారు. జిల్లా కేంద్రంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ పథకం ఇప్పటికే జిల్లాలో ఆరు సార్లు రుణాలు పంపిణీ చేశారు. ఆరు విడతల్లో జిల్లాలో 92, 540 మందికి గాను రూ. 92.54 కోట్ల రుణ ప్రయోజనం చేకూరింది. ఏడో విడ తలో 22,794 మంది లబ్ధిదారులకు రూ.22.80 కోట్ల ప్రయోజనం చేకూరుతోంది.

'రీ సర్వేలో తప్పులు ఉండకూడదు'

అరసవల్లి: జిల్లాలో రీసర్వే పనుల్లో ఎక్కడా తప్పులు జరగకూడదని, తప్పులు చేసిన వారిపై చర్యలకు వెనుకాడేది లేదని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ హెచ్చరించారు. ఆయన సోమవారం సాయంత్రం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శ్రీకాకుళం డివిజన్ సర్వేయర్లతో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రీసర్వే ప్రక్రియ ఈనెలాఖరులోగా పూర్తి కావాల్సిందేనని సూచించారు. ఇప్పటివరకు చేపట్టిన మండలాల వారీగా కలెక్టర్ ఆరా తీశారు. చాలా మండలాల్లో పనుల జాప్యంపై తహసీల్దార్లు వివరణ ఇచ్చారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వారిని ఆదేశించారు. జేసీ నవీన్ మాట్లాడుతూ సకాలంలో పనులు పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ఈనెల 27 నాటికి ఫారం-8 జనరేట్ చేయాలని, గ్రౌండ్ వేలిడేషన్ పూర్తయినప్పటికీ వీఆర్వో లాగిన్‌లో ఎందుకు జాప్యం జరుగుతోందని ప్రశ్నించారు.

సీఐలకు స్థాన చలనం

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకు సంబంధించి పలువురు సీఐలకు స్థానచలనం కల్పిస్తూ విశాఖపట్నం రేంజి కార్యాలయం నుంచి ఉత్తర్వులు ఇచ్చినట్లు జిల్లా పోలీసు కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ మేరకు జిల్లా క్రైమ్ రికార్డు బ్యూరో (డీసీఆర్‌బీ) సీఐగా ఉన్న బూర ప్రసాదరావును నరసన్నపేట సీఐగాను, నరసన్నపేట సీఐగా ఉన్న దుక్క రాము విశాఖ రేంజి వీఆర్‌లోకి, విశాఖపట్నం రేంజి వీఆర్‌లో ఉన్న డి.నవీన్‌కుమార్, కె.లక్ష్మణమూర్తిలను శ్రీకాకుళం డీసీఆర్‌బీ, డీఎస్‌బీ (జిల్లా స్పెషల్ బ్రాంచి) సీఐలుగా బదిలీ చేస్తున్నట్లు ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఆటో వర్క్‌షాపులో అగ్నిప్రమాదం

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళంలోని ఓ ఆటో వర్క్ షాపులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా సోమవారం అగ్నిప్రమాదం సంభవించి రూ. 3 లక్షల మేర నష్టం సంభవించినట్లు జిల్లా అగ్నిమాపక సహాయ అధికారి వరప్రసాదరావు పేర్కొన్నారు. ఆయన చెప్పిన వివరాల మేరకు.. పాత దీపామహల్ పక్కన ఉన్న శ్రీ సాయి నీల ఆటోవర్క్ షాప్ షట్టర్‌ను ఉదయం తెరవగానే పొగ, మంటలు చెలరేగి రావడంతో అప్రమత్తమైన షాపు యాజమాన్యం ఫైర్ అధికారులకు సమాచారం అందించారు. వెనువెంటనే గురువారెడ్డి, పాపారావు, రమణ, కూర్మారావులతో కూడిన ఫైర్‌సిబ్బంది టెండరింగ్ ఇంజిన్‌తో వచ్చి ఫోమ్, వాటర్‌ను షాపులోకి ప్రెషర్ ద్వారా కొట్టి మంటలను అదుపు చేశారు. లోపలికి వెళ్లి చూడగా పాత ద్విచక్రవాహనాలు ఎనిమిది, టైర్లు, ఆయిల్ అన్నీ కాలిపోయి ఉన్నాయి.

కళా గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం కల్చరల్: కళ్లేపల్లిలోని సంప్రదాయ కళా గురుకులంలో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి కూచిపూడి నృత్యంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు గురుకులం డైరెక్టర్ స్వాతీసోమనాథ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే గురుకులం గుర్తింపబడినట్టు పేర్కొన్నారు. తిరుపతి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయానికి అనుబంధంగా కోర్సులను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇక్కడ చేరేవారికి హాస్టల్ సౌకర్యం ఉందన్నారు. మరిన్ని వివరాలకు 9440681083, 7731909837 నంబర్లను సంప్రదించాలన్నారు.

తెగిపడిన విద్యుత్ వైర్లు

- తప్పిన పెను ప్రమాదం

శ్రీకాకుళం: శ్రీకాకుళం జి.టి.రోడ్డులోని పందుంపుల్లల జంక్షన్‌లో సోమవారం ఉదయం పెనుప్రమాదం తప్పింది. జనం రద్దీగా ఉన్న పది గంటల సమయంలో విద్యుత్ హైటెన్షన్ వైరు పెద్ద శబ్దంతో తెగిపోయింది. దీంతో అక్కడ ఉన్నవారంతా భయంతో పరుగులు తీశారు. అయితే వైరు పడిన చోటే ఉండిపోవడం.. అక్కడ మున్సిపాలిటీకి చెందిన చెత్త కుండీ మాత్రమే ఉండడంతో ఎలాంటి నష్టం వాటిల్లలేదు. సమీపంలోని వారు విద్యుత్ కార్యాలయానికి సమాచారం అందించడంతో సిబ్బంది తక్షణం సరఫరాను నిలిపివేశారు. కొద్ది సేపటి తరువాత సిబ్బంది చేరుకొని మరమ్మతులు చేసి సరఫరాను పునరుద్ధరించారు.

సొండిపూడి విద్యార్థుల ప్రతిభ

మందస: సొండిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ఫైర్ అండ్ సేఫ్టీ అనే అంశంపై జరిగిన పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ఇదే పాఠశాలకు చెందిన విద్యార్థులు సాధించారు. సాయిగౌతమి పాణిగ్రాహి, బాడ శ్రీకాంత్, బాడ శ్రీజలకు జనరల్ మేనేజర్ కె.రామచందర్ సోమవారం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం బి.ఎస్.సాల్మన్‌అనిల్, ఉపాధ్యాయులు నగిరి కరుణాకర్ పాల్గొన్నారు.

భంభం భోలే..



భారీ విల్లుతో పాదయాత్ర చేస్తున్న త్రినాథ్ యువజన కావుడియా సభ్యులు

- సందడిగా భోల్‌భం దీక్షలు
- కాలి నడకన కావడియాత్ర చేపట్టిన భక్తులు

భువనేశ్వర్: శ్రావణమాసం పురస్కరించుకుని ప్రతి సోమవారం సంకల్పసిద్ధి కోసం జలాశయాల్లో శుచి శుభ్రతతో జలం సేకరించి, కాలి నడకన శైవక్షేత్రాన్ని సందర్శించడంతో పాటు ఆరాధ్యదైవం శివునికి జలాభిషేకం నిర్వహించడమే భోల్‌భం దీక్ష. జలాశయాల్లో సేకరించిన నీటితో నింపిన కావడి భుజాన వేసుకుని, బయల్దేరింది మొదలుకొని గమ్యం చేరేంత వరకు కింద దించకుండా జాగ్రత్త వహిస్తారు. ఈ మేరకు దారి పొడవునా అనుకూల పరిస్థితులను సద్వినియోగ పరచుకుంటారు. ఈ క్రమంలో బిడానాసి కుంభార్ సాహి యువకులు వినూత్న ప్రయోగంతో బయల్దేరారు. కటక్ నగరానికి చెందిన బిడానాసి కుంభార్ సాహి త్రినాథ్ యువజన కావుడియా(కావడిధారులు) సంఘం అతి పెద్ద విల్లుతో మహా దేవునికి జలాభిషేకం చేసేందుకు పాదయాత్ర చేపట్టారు. ఈ సంఘంలో 150 మందికి పైగా సభ్యులు ఈ యాత్రలో పాలుపంచుకున్నారు. గత 15 ఏళ్లుగా ఈ బృందం విభిన్న ఆకృతులతో కావడి తయారు చేసి, సందర్శకులను ఆకట్టుకుంటున్నారు. ఈ ఏడాది 300 అడుగుల పొడవు, 6 అడుగుల ఎత్తున్న శివధనస్సు తయారు చేశారు. దీనికి అమర్చిన కావడిలో 30 లీటర్ల జలం నింపి, అఠొగొడా ప్రాంతంలోని సప్తేశ్వరుని క్షేత్రానికి కాలి నడకన చేరారు. సంఘం సభ్యులు 20 రోజులు నిరవధికంగా శ్రమించి రూ. 35 వేలు వ్యయంతో ఈ విల్లును తయారు చేశారు. తయారీలో వెదురు, కలప, రంగురంగుల కాగితపూలు వినియోగించి ఆకర్షణీయంగా మలిచారు. కటక్ నుంచి అఠొగొడా వరకు దారి పొడవునా ఈ విల్లు చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. శివ దీక్షతో కటక్ నగ వాసుల సౌభాతృత్వ విలువలను ప్రతిబింబించే లక్ష్యంతో ఏటా ఇటువంటి ప్రయోగాలతో పాదయాత్ర నిర్విఘ్నంగా నిర్వహిస్తున్నట్లు యువజన కావుడియా సంఘం సభ్యులు తెలిపారు.

గుప్తేశ్వర్‌లో పోటెత్తిన భక్తులు..

జయపురం: దక్షిణ ఒడిశాలో సుప్రసిద్ధ శివక్షేత్రం గుప్తేశ్వర్‌లో శివ లింగానికి జలాభిషేకం చేసేందుకు శ్రావణ మాసం రెండో సోమవారం భోల్‌భం కావిడి భక్తులు పోటెత్తారు. శనివారం నుంచే అనేక ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో గుప్తేశ్వర్ చేరుకున్నారు. సోమవారం సాయంత్రం వరకు భక్తుల తాకిడి కొనసాగుతునే ఉంది. మార్గంలో పవిత్ర కళశాలకు పూజలు చేసి, గుప్తేశ్వర్‌కు రావడం కనిపించింది. జయపురం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించారు. దీక్షధారులకు స్వాగతం పలుకుతూ పండ్ల రసాలు, పానీయాలు అందజేశారు.

బరంపురంలో..

బరంపురం: భోల్‌భం దీక్షాధారులకు పవిత్రమైన రోజు కావడంతో నగరమంతా సందడిగా మారింది. దీక్షకు కావాల్సిన సామగ్రి కొనుగోలుదారులతో గిరి మార్కెట్, బాపు బజార్, కొమ్మాపల్లి, పెద్ద బజార్‌లలో వందలాది మంది భక్తులు చేరుకున్నారు. వీరంతా వివిధ నదుల నుంచి పవిత్ర జలాలను కావిడిలో సేకరించి, కాలినడకన శివాలయాలను దర్శించుకున్నారు. పరమశివుని అభిషేకించి, ప్రత్యేక పూజలు చేశారు.

ఏకామ్ర క్షేత్రం లింగరాజ మహాప్రభువు జలాభిషేకం కోసం నిరీక్షిస్తున్న శివ దీక్షకులు



రేయంతా నిరీక్షణ..

శివ దీక్షకు శ్రావణమాసం అత్యంత పవిత్రంగా భావిస్తారు. ఈ మాసం పొడవునా ప్రతి సోమవారం పాదయాత్రలో శైవ క్షేత్రాలు సందర్శించి మహా దేవునికి శుద్ధ జలంతో అభిషేకించి ఆశీస్సులు పొందుతారు. దీక్షకుల అభీష్టం మేరకు నిర్ధారించుకున్న శైవ క్షేత్రానికి ఆదివారం రాత్రే చేరుకునేలా పాదయాత్ర ప్రణాళికబద్ధంగా నిర్వహిస్తారు. శ్రావణమాసం రెండో సోమవారం పురస్కరించుకుని పెద్ద సంఖ్యలో దీక్షధారులు భువనేశ్వర్ లోని ఏకామ్రక్షేత్రం లింగరాజు దేవస్థానానికి చేరుకున్నారు. రాత్రంతా దేవస్థానం ప్రాంగణంలో వీరు విశ్రమించేందుకు ఆలయ వర్గాలు అనుబంధ ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాకారం నలువైపులా 500మీటర్ల పరిధిలో బారికేడ్లు ఏర్పాటు చేసి, సోమవారం ఉదయం 4 గంటల నుంచి లింగరాజు మహా ప్రభువుకు జలాభిషేకం చేసేందుకు దీక్షకులను అనుమతించారు. కోవిడ్-19 ఆంక్షలు పూర్తిగా తొలగించడంతో ఈ ఏడాది భోల్‌భం భక్తుల తాకిడి విపరీతంగా పెరిగింది. దీక్షకుల పాదయాత్ర బాటలో భంభం భోలే నినాదం మార్మోగింది.



బరంపురం: రూశికుల్య నదిలో పవిత్ర జలాన్ని సేకరిస్తున్న దీక్షధారులు



బరంపురం: నీలకంఠేశ్వర ఆలయంలో అభిషేకిస్తున్న దృశ్యం



జయపురం: మార్గంలో భక్తులకు సేవలందిస్తున్న రోటరీ సభ్యులు




జయపురం: పవిత్ర కలశాలకు పూజలు చేస్తున్న భక్తులు

పతిత పావనునికి చిత్తా లగ్గి..



జగన్నాథుని బ్రహ్మజ్యోతి చిత్తా



పతిత పావనుని రజత చిత్తా శోభ

- జగన్నాథుని నుదుట బ్రహ్మజ్యోతి వజ్రాభరణం అలంకరణ

భువనేశ్వర్: జగన్నాథుడు శోభాయమానుడు. నుదుట వజ్ర ఖచిత ఆభరణం.. చిత్తా అలంకరణ శోభితుడు. స్వామి నుదుట తేజిల్లే వజ్రం బ్రహ్మజ్యోతిగా పేరొందింది. శ్రీమందిరం రత్న వేదికపై కొలువుదీరిన స్వామి ఈ అలంకరణతో భక్తులకు దర్శనమిమిస్తారు. ఏటా జ్యేష్ఠ పూర్ణిమ పురస్కరించుకుని జలాభిషేకం సందర్భంగా స్వామి నుదుట వజ్ర, వైడూర్య ఇతరేతర అమూల్య రత్నాలు పొదిగిన చిత్తా తొలగిస్తారు. తిరిగి శ్రావణమాసం అమావాస్య పురస్కరించుకుని చిత్తా అమావాస్యగా పరిగణించి మూలవిరాట్‌కు అమూల్య రత్నఖచిత చిత్తా ఆభరణాన్ని సోమవారం నుదుట అలంకరించారు. ఈ సేవ ముగిసేంత వరకు సాధారణ భక్తులకు సర్వదర్శనం నిలిపి వేశారు. తొలి భోగ మండపసేవ అనంతరం చిత్తా లగ్గి సేవ ప్రారంభించారు. రత్న వేదికపై కొలువుదీరిన దేవతాత్రయం మూల విరాట్‌ల నుదుట రత్న ఆభరణం అలంకరించారు. మూల విరాటుల బాడొగ్రాహి, దైతపతి సేవాయత్ వర్గీయులు ఈ అలంకరణ ప్రక్రియలో పాల్గొనడం ఆచారం. అలంకరణకు ముందు శుద్ధ సువార్ సేవకులు సిద్ధం చేసిన ప్రత్యేక ద్రవ్యంతో(స్వర్ణ ఒషా) ఆభరణం లేపనం చేసి, మూల విరాటుల నుదుట అలంకరించారు. ఇది పూర్తి కావడంతో శ్రీమందిరం సింహద్వారం ప్రాంగణంలో నిత్య పూజలందుకోవడంతో పాటు భక్తులు, యాత్రికులకు తొలి దర్శనం ఇచ్చే పతిత పావనుడు నుదుట ఆభరణంతో శోభిల్లాడు. పతిత పావనునికి రజత చిత్తాతో అలంకరించారు. రత్న వేదికపై బలభద్ర స్వామి నుదుట నీలం, దేవీ సుభద్ర నుదుట మాణిక్యంతో పొదిగిన ఆభరణం(చిత్తా) అలంకరించారు.

నేడు, రేపు వినూత్న బోధన, పరిశోధన అంశాలపై సదస్సు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో మంగళ, బుధవారాల్లో ఉన్నత విద్యా సంస్థల్లో వినూత్న బోధన, పరిశోధన అంశాలపై సదస్సు నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ సి.హెచ్.ఎ.రాజేంద్రప్రసాద్ సోమవారం తెలిపారు. తమిళనాడు సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ చంద్రమోహన్, బీఆర్ఏయూ వీసీ నిమ్మ వెంకటరావు హాజరు కానున్నారని చెప్పారు. సెమినార్ కన్వీనర్‌గా కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నీలం సంతోష్ రంగనాథ్ వ్యవహరిస్తారన్నారు.

బీసీడీఈ సమన్వయకర్తలకు శిక్షణ రేపు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఈ నెల 19న ఏఫిలియేషన్ కాలేజ్‌ల బీసీడీఈ (బోర్డ్ ఫర్ కమ్యూనిటీ డెవలప్ మెంట్ త్రూ ఎడ్యుకేషన్) సమన్వయకర్తలకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వర్సిటీ బీసీడీఈ అధికారి బి.అజయ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ఉన్నత విద్యామండలి, బీసీడీఈ రాష్ట్ర కార్యాలయం, యునిసెఫ్‌లు సంయుక్తంగా నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి నిపుణులు, వర్సిటీ అధికారులు హాజరవుతారన్నారు.

ఏడుగురికి షోకాజ్ నోటీసులు జారీ



స్పందన వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జేసీ, ఇతర అధికారులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్పందన ఫిర్యాదులను జాప్యం చేయకుండా పరిష్కరించాలని కలెక్టర్ శ్రీకేష్ బి.బిలాఠకర్ సూచించారు. స్పందన అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఏడుగురు అధికారులకు షోకాజ్ నోటీసులు జారీచేశారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమంలో పాల్గొని అర్జీలు స్వీకరించారు. ఆయనతో పాటు జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ఇన్‌చార్జి డీఆర్ఓ మురళీకృష్ణ, ప్రత్యేక ఉప కలెక్టర్ జయదేవి పాల్గొన్నారు. పనితీరులో నిర్లక్ష్యం కనబరిచినా, కాలయాపన చేసినా, అవినీతికి పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. బియాండ్ ఎస్ఎల్ఏ 14 ఉండడం పై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి సంబంధించి శ్రీకాకుళం ఆర్డీఓ, పొందూరు, కొత్తూరు తహసీల్దార్లు, ఆమదాలవలస(పోలీస్) ఎస్‌హెచ్ఓ, కలెక్టరేట్ సిబ్బందికి ఇద్దరు, డీఎస్పీ కార్యాలయం క్లర్క్‌కు కలిపి ఏడుగురికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ వారం స్పందనకు మొత్తం 198 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో డీఎస్ఓ వెంకటరమణ, జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, జిల్లా పరిషత్ సీఈఓ వెంకట్ రామన్, జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య, డీఎంహెచ్ఓ డాక్టర్ బి.మీనాక్షి, జిల్లా ఉద్యాన అధికారి ప్రసాదరావు, అన్ని శాఖల జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

లక్ష్మీపూర్‌లో ప్రజాస్పందన

- మూడు పంచాయతీల నుంచి 202 వినతులు



లబ్ధిదారులకు భూ పట్టాలు అందిస్తున్న కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్

పర్లాకిమిడి: గజపతి జిల్లాలోని రాయఘడ బ్లాక్ లక్ష్మీపూర్ పంచాయతీ కార్యాలయంలో గ్రామముఖి పరిపాలన, గ్రీవెన్స్ కార్యక్రమాన్ని కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. అదనపు ఎస్పీ సునీల్ మహంతి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి ఫాల్గుని మాఝి హాజరయ్యారు. ఈ సందర్భంగా పంచాయతీ పరిధిలోని కోయిపూర్, జిరంగో, తలముండ గ్రామాల నుంచి అధికంగా 202 వినతులు అందాయి. వీటిలో 57 గ్రామ సమస్యలు, 145 వ్యక్తిగత అభియోగాలు అందాయి. 63 వినతులను అధికారులకు అక్కడికక్కడే పరిష్కరించారు. ఒకరికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.10వేలను కలెక్టర్ అందజేశారు. 15మందికి ఇళ్లు, భూ పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాయఘడ చైర్మన్ పూర్ణబాసి నాయక్, ఉపాధ్యక్షురాలు జ్యోతి పాణి, రాయఘడ బీడీఓ సుధీర్‌కుమార్ సింగ్, తహసీల్దార్ లీలావతి ఆచార్య, సడీఎంఓ డాక్టర్ ప్రదీప్‌కుమార్ పాత్రొ, ప్రజాస్పందన కార్యక్రమం అధికారి, లక్ష్మీపూర్ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

లికిటిపాదొరొలో వినతుల స్వీకరణ

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ సబ్ డివిజన్ పరిధి పద్మపూర్ పంచాయతీ లికిటిపాదొరొ గ్రామంలో జిల్లా యంత్రాంగం వినతుల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ సోమనాథ్ ప్రధాన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ వివేకానంద శర్మ, గుణుపూర్ సబ్ కలెక్టర్ లలిత్‌కుమార్ కుహోరా, జిల్లా ముఖ్య వైద్యాధికారి లాల్‌మోహన్ రౌత్రాయ్, గుణుపూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి శాంతిప్రభా ప్రధాన్ తదితరులు హాజరయ్యారు. కార్యక్రమంలో 82వినతులు అధికారుల దృష్టికి రాగా, ఇందులో 70 వ్యక్తిగతమైనవి, 12 గ్రామ సమస్యలుగా గుర్తించారు. మో ఘురో పథకం కింద ఓ కుటుంబానికి రూ.3 లక్షల చెక్కును అదనపు కలెక్టర్ సోమనాథ్ ప్రధాన్ అందించారు. అదేవిధంగా లికిటిపాదొరొ గ్రామంలోని పాఠశాలకు పట్టా అందించారు. స్వీకరించిన ప్రజా వినతులను త్వరితగతిన పరిష్కారమయ్యే విధంగా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఏడీఎం ఆదేశించారు.



ప్రజా స్పందనలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్



రాయగడ: పాఠశాల పట్టాను అందిస్తున్న అధికారులు

వైద్యులపై డీసీహెచ్‌ఎస్ ఆగ్రహం



వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీసీహెచ్‌ఎస్ భాస్కరరావు

పొందూరు: స్థానిక సీహెచ్‌సీకి వైద్యులు 10.30 గంటలైనా రాకుండా నిర్లక్ష్యం చూపడంపై డీసీహెచ్‌ఎస్ జె.భాస్కరరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పొందూరు సీహెచ్‌సీకి వైద్యులు సకాలంలో రావటం లేదని 10 గంటల సమయంలో రోగులు ఫోన్ చేయడంతో డీసీహెచ్‌ఎస్ బయల్దేరి 11.45 గంటలకు చేరుకు న్నారు. వైద్యుల ఆలస్యంపై వివరణ ఇవ్వాలని వైద్యులను, సూపరింటెండెంట్ రామదాస్‌ను అడిగారు. వైద్యులను వెనుకేసుకుని రావడాని కి సూపరింటెండెంట్ ప్రయత్నించడంతో ఆయనపై మండిపడ్డారు. వైద్యులకు మెమోలు జారీచేస్తున్నట్లు తెలిపారు. మరోసారి ప్రజల నుంచి, రోగుల నుంచి ఫిర్యాదులు వస్తే తీవ్రంగా చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.

'మహాసభలు జయప్రదం చేయండి'

కాశీబుగ్గ: పలాసలో ఈ నెల 22, 23వ తేదీల్లో జరగనున్న అంగన్‌వాడీ (సీఐటీయూ) యూనియన్ జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, కార్యదర్శి నెయ్యిల గణపతి కోరారు. పలాస సీఐటీయూ కార్యాలయంలో వారు సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి నేతలు హాజరయ్యే కార్యక్రమానికి అందరూ రావాలన్నారు.

బ్రీత్ ఎన్‌లైజర్లు, టార్చ్‌లైట్ల అందజేత



బ్రీత్ ఎనలైజర్లు, టార్చ్‌లైట్లను పరిశీలిస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్: పోలీసు సేవలకు ఉపయోగపడే బ్రీత్ ఎనలైజర్స్, టార్చ్‌లైట్లను యాక్సిస్ క్లినికల్స్ లిమిటెడ్ ప్రతినిధులు ఎస్పీ జి.ఆర్.రాధికకు తన కార్యాలయంలో సోమవారం కలిసి అందించారు. శ్రేస్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ సంస్థలు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్ఆర్) కింద పోలీసుకు అనునిత్యం విధి నిర్వహణలో ఉపయోగపడే 15 బ్రీత్ ఎనలైజర్స్, 20 టార్చ్‌లైట్లను ఎస్పీకి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసులకు ఎంతగానో ఉపయోగపడే సామగ్రిని అందించడం అభినందనీయమని కొనియాడారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిని గుర్తించడానికి బ్రీత్ ఎనలైజర్‌లు, రాత్రిపూట గస్తీ నిర్వహించే పోలీసు సిబ్బందికి టార్చ్‌లైట్లు ఉపయోగపడతాయన్నారు. అరబిందో ఫార్మాసూటికల్స్, దాని బృందం అందిస్తున్న సేవల్లో భాగంగా కంపెనీ అడ్మినిస్ట్రేటివ్ హెడ్ పి.గోపాలకృష్ణారెడ్డి, హెచ్ఆర్ జనరల్ వింగ్ మేనేజర్ కె.కమలాకర్‌రెడ్డిలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు టి.పి.విఠలేశ్వరరావు, జె.తిప్పేస్వామి, యర్రగుంట శృతి, ఎస్.బాలరాజు, జె.ఆర్.పురం సీఐ ఆదాం, ఎస్ఐ రాజేష్, అరబిందో కంపెనీ సభ్యులు ఉన్నారు.

'బాడీ బిల్డింగ్‌కు ఆదరణ పెరగాలి'



బాడీబిల్డింగ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు, నిర్వహణ కమిటీ ప్రతినిధులు, జిమ్‌ల ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ:

బాడీబిల్డింగ్‌కు మరింత ఆదరణ పెరగాలని, ప్రభుత్వం తరఫున అవసరమైన ప్రోత్సాహాన్ని అందిస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. త్వరలో జరిగే ఆలిండియా బాడీబిల్డింగ్ పోటీల పోస్టర్‌ను ఆయన సోమవారం శ్రీకాకుళంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి ధర్మాన మాట్లాడుతూ క్రీడలు, వ్యాయామంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. మారుతున్న ఆహారపు అలవాట్ల నేపథ్యంలో చిన్న వయసులోనే అనారోగ్యం బారిన పడుతున్నారని.. అందుకు వ్యాయామం, యోగా చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ గోపీ, ఫ్లెక్స్ జిమ్ అధినేత కొమ్మాన గౌరీ శంకర్, కరాటే శిక్షకులు రెడ్డి ఢిల్లీశ్వరరావు, బుక్కా యుగంధర్, హరీష్, బంకు రాజు, గణేష్, సందీప్ తదితరులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి కూడా పోస్టర్‌ను తన నివాసంలో ఆవిష్కరించి అవసరమైన సాయం చేస్తానన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



ప్రతిభా పురస్కారాలను అందజేస్తున్న సంఘ నాయకులు ఈశ్వరరావు, తదితరులు

విజయనగరం టౌన్: ప్రతిభావంతులైన నిరుపేద విద్యార్థులకు చేయూతనివ్వడమే తమ లక్ష్యమని సుధారాణి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు ఎంపీజీ ఈశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక కార్యాలయం ఆవరణలో టెన్త్, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన శిష్టకరణ కులానికి చెందిన 30 మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, నగదు బహుమతి, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమ ట్రస్ట్ ద్వారా నిరుపేద విద్యార్థులు, పేద కుటుంబాలకు చేయూతనివ్వడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి ఎం.పి ఉపేంద్ర, త్యాడ ప్రసాద్, వి.వెంకటేష్, ప్రభాత్‌కుమార్, శంకరరావు, సంఘ నాయకులు పి.ఉమామహేశ్వరరావు, కృష్ణ, సుధాకర్, సంగీత, శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

నెల్లిమర్ల రూరల్: నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేట గ్రామానికి చెందిన వివాహిత సోమవారం ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటనపై స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శాంతినగర్ వీధికి చెందిన అవనాపు పావని వ్యక్తిగత కారణాలతో సోమవారం మధ్యాహ్నం సుమారు 2.30 గంటల ప్రాంతంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. ఈ నేపథ్యంలో ఆమె కుమార్తె బిగ్గరగా ఏడవడంతో స్థానికులు వెళ్లి చూడగా..పావని ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. అపస్మారక స్థితికి చేరుకున్న ఆమెను స్థానికులు, కుటుంబసభ్యులు విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నారాయణరావు తెలిపారు.

పురుగు మందు తాగి వ్యక్తి...



చికిత్స పొందుతున్న సీతంనాయుడు

పార్వతీపురం: అనారోగ్యం కారణంగా కుటుంబసభ్యులకు భారం కాకూడదని భావించిన వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. వివరాలిలా ఉన్నాయి. సీతానగరం మండలం సుమిత్రాపురం గ్రామానికి చెందిన తెర్లి సీతంనాయుడుకు రెండేళ్ల క్రితం కుడికాలు, కుడి చేయి పక్షవాతంతో పడిపోయాయి. ఇంటిలోని కుటుంబసభ్యులకు భారం కాకూడదని భావించి సోమవారం పురుగు మందు తాగేశాడు. ఈ విషయాన్ని కుటుంబసభ్యులు గమనించి 108 వాహనంలో పార్వతీపురం మన్యం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

సూపర్ వాస్మోల్ తాగి మహిళ..



చికిత్స పొందుతున్న నాగిని

పార్వతీపురం: కన్న కుమారుడు చెప్పిన మాట వినడంలేదని మనస్తాపం చెందిన ఓ తల్లి సూపర్ వాస్మోల్ తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. సోమవారం జరిగిన సంఘటనపై పార్వతీపురం అవుట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొమరాడ మండలం గుమడ గ్రామానికి చెందిన మామిడి నాగినికి 16 ఏళ్ల కుమారుడు నితిన్ ఉన్నాడు. నితిన్ వీధిలో ఉన్న ఇతర స్నేహితులతో కలిసి హైదరాబాద్, చెన్నై వెళ్లిపోతానని అంటున్నాడు. ఉన్న ఒక్కగానొక్క కుమారుడు వెళ్లిపోతే ఎలా అని తల్లి నాగిని మనస్తాపానికి గురై సోమవారం రాత్రి తలకు రాసుకునే సూపర్ వాస్మోల్ తాగేసింది. ఈ విషయం గమనించిన కుటుంబసభ్యులు 108 ద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ముందస్తు జాగ్రత్తలతో సీజనల్ వ్యాధులకు చెక్

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: సీజనల్ వ్యాధుల ప్రబలకుండా ముందస్తు నివారణచర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు వైద్యాధికారులను ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డెంగీ, మలేరియా, చికున్‌గున్యా తదితర వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. దోమలు వృద్ధిచెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి పథకాల్లో క్లోరినేషన్ చేయించాలని తెలిపారు. ఫీవర్ సర్వేలో గుర్తించిన జ్వరపీడితులకు అవసరమైన వైద్య పరీక్షలు చేసి వ్యాధి నిర్ధారణ అయిన వారికి మెరుగైన చికిత్స అందించాలన్నారు. సమావేశంలో డీఎల్‌ఓ ఎస్.సూర్యనారాయణ, ఎన్‌సీడీ పీఓ డాక్టర్ రవికుమార్, డీఐఓ డాక్టర్ అచ్చుతకుమారి, ఎపిడిమాలజిస్టు వెంకటేష్, డీఎంఓ వై.మణి, తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంపై పిటిషనర్ల సంతృప్తి ముఖ్యం

- కలెక్టర్ నాగలక్ష్మి
- 'జగనన్నకు చెబుదాం'కు 259 వినతులు



కలెక్టరేట్‌లో జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి .

విజయనగరం అర్బన్: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఏదైనా అంశంపై వచ్చిన వినతిని ఆయా ప్రభుత్వ శాఖలు పరిష్కరించిన తర్వాత ఆ విషయాన్ని వినతిని అందజేసిన పిటిషనర్‌కు సంబంధిత శాఖల అధికారులు స్వయంగా కలిసి తెలియజేయాలని కలెక్టర్ నాగలక్ష్మి.ఎస్ ఆదేశించారు. సంబంధిత వినతి సంతృప్తికరంగా పరిష్కారమైనట్లు ఆయా వినతిదారుల నుంచి ఆమోదం పొందాలని స్పష్టం చేశారు. అర్జీదారుల వినతుల పరిష్కారంలో సంతృప్తిస్థాయి ఇంకా మెరుగుపడాల్సి ఉందని హితవు పలికారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ మయూర్ అశోక్, డీఆర్‌ఓ ఎం.గణపతిరావు, ఆర్‌డీఓ ఎంవీసూర్యకళ, డిప్యూటీ కలెక్టర్‌లు సూర్యనారాయణ, పద్మలత, సుదర్శన దొర తదితరులు అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా గడిచిన వారం రోజుల్లో సంతృప్తికర స్థాయిలో పరిష్కారం కాని వినతులపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. సంబంధిత ప్రభుత్వ శాఖలు ఆయా సమస్యలు పరిష్కరించినట్లు చూపిస్తున్నప్పటికీ వినతిదారుల నుంచి సంతృప్తి వ్యక్తం కాకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేసిన వినతులు ఎక్కువగా ఉంటున్నాయని, దీనిపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. వ్యవసాయ, గృహనిర్మాణ, ప్రజారవాణా, పంచాయతీ రాజ్, పోలీసు, రోడ్లు భవనాలు, గ్రామీణ నీటిసరఫరా, విద్యాశాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖలతో పాటు వలంటీర్ల పనితీరుపై వచ్చిన ఫిర్యాదులకు సంబంధించి కలెక్టర్ సమీక్షించారు. వినతుల స్వీకరణ కార్యక్రమానికి వివిధ వర్గాల ప్రజల నుంచి ఈ వారం 259 వినతులు అందాయి. వాటిలో అత్యధికంగా 161 వినతులు రెవెన్యూ శాఖకు చెందినవి ఉన్నాయి. గ్రామ వార్డు సచివాలయాల శాఖ 38, గృహనిర్మాణ సంస్థ 23, పంచాయతీ రాజ్ శాఖ 10, డీఆర్‌డీఏ 9, మున్సిపల్ శాఖ 7, వైద్య ఆరోగ్యశాఖ 6, ఆస్పత్రుల విభాగానికి 3, ఈపీడీసీఎల్ 2 వినతులు అందాయి.

ఫిర్యాదుదారులకు తక్షణ న్యాయం



స్పందనలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: స్పందన కార్యక్రమంలో ఫిర్యాదుచేసిన బాధితులకు తక్షణ న్యాయం చేయాలని ఎస్పీ ఎం.దీపిక పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో భాగంగా జిల్లా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకుని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. స్పందనలో భాగంగా 36 ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ట్రాఫిక్ డీఎస్పీ విశ్వనాథ్, ఎస్పీ సీఐ ఈ.నరసింహమూర్తి, డీసీఆర్‌బీ ఎస్సైలు వాసుదేవ్ ప్రభావతి, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వినతుల సత్వర పరిష్కారానికి చర్యలు



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతులను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, ఐటీడీఏ పీఓ సి.విష్ణు చరణ్, జిల్లా రెవెన్యూ అధికారి జె. వెంకటరావుతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అధికంగా వ్యక్తిగత సమస్యలు, భూ సమస్యలు పరిష్కరించాలని పలువురు వినతులను అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ పి.కిరణ్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి బి.జగన్నాధరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, జిల్లా పౌరసరఫరాల అధికారి సూర్యారావు, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.ప్రేమ్ కుమార్, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కె. విజయ గౌరి, జిల్లా ప్రణాళిక అధికారి పి.వీరరాజు, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి ఎం.డి. గయాజుద్దీన్ ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

డీవీజీని కలిసిన ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ



ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావును సత్కరిస్తున్న ఆదివాసీ జేఏసీ ప్రతినిధులు

విజయనగరం: ఎస్టీ కమిషన్ రాష్ట్ర ఛైర్మన్‌గా నియమితులైన మాజీ ఎంపీ డీవీజీ శంకరరావును ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు సోమవారం కలిశారు. ఈ మేరకు విజయనగరంలో జరిగిన కార్యక్రమంలో జేఏసీ ఛైర్మన్ నిమ్మక జయరాజ్, ఇతర ప్రతినిధులు డీవీజీ శంకరరావుకు శుభాకాంక్షలు తెలిపారు. గతంలో ఆదివాసీ జేఏసీ ఉపాధ్యక్షుడిగా పనిచేసిన అనుభవం ఉన్న వ్యక్తిని ఎస్టీ కమిషన్ ఛైర్మన్‌గా నియమించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో షెడ్యూల్డ్, నాన్ షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఉన్న గ్రామాలపై స్పష్టత ఇవ్వాలని కోరారు. షెడ్యూల్డ్ ప్రాంతాలను నిర్ధారించి గిరిజనులకు న్యాయం చేయాలని జయరాజ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జేఏసీ ప్రతినిధులు డీవీజీ శంకరరావును సత్కరించి అనంతరం ఇచ్చిన వినతిపత్రంపై స్పందించిన ఆయన సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జేఏసీ వైస్ ఛైర్మన్ కొండగొర్రి ఉదయ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ నిమ్మక అన్నారావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్దవోలులో శాంతి భద్రతల పరిరక్షణ

- బొబ్బిలి రూరల్ సీఐ తిరుమలరావు



విలేకరులతో మాట్లాడుతున్న బొబ్బిలి రూరల్ సీఐ తిరుమలరావు

తెర్లాం: మండలంలోని ఉద్దవోలు గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని బొబ్బిలి రూరల్ సీఐ తిరుమలరావు అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు, మాజీ సర్పంచ్ ఏగిరెడ్డి కృష్ణ హత్యకు గురైన నేపథ్యంలో ఎస్పీ దీపిక ఆదేశాల మేరకు గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పేలా చర్యలు చేపట్టామని తెలిపారు. గ్రామంలో మూడు రోజులుగా పోలీస్ పికెట్, 144 సెక్షన్ అమలు చేస్తున్నామని చెప్పారు. మాస్టారి హత్యతో గ్రామంలో శాంతి భద్రతల సమస్య తలెత్తే ఆస్కారం ఉందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని ఎటువంటి గొడవలు, ఘర్షణ జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. గ్రామస్తులంతా సమనయం పాటించాలని, ఎటువంటి అల్లర్లకు పాల్పడవద్దని, గ్రామంలో ప్రశాంత వాతావరణం ఉండేలా సహకరించాలని కోరారు. సమావేశంలో ఆయనతో పాటు తెర్లాం, బాడంగి, రామభద్రపురం ఎస్సైలు ఉన్నారు.

రాష్ట్రస్థాయి ఉషు పోటీల్లో 9 పతకాలు



ఉషు పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఉషు పోటీల్లో విజయనగరం జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు సత్తా చాటారు. ఈనెల 15,16 తేదీల్లో శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో జరిగిన 10వ సబ్‌జూనియర్స్ అంతర్ జిల్లాల బాల, బాలికల ఉషు పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు 9 మంది పతకాలు సాధించారు. సాధించిన పతకాల్లో రెండు గోల్డ్‌మెడల్, నాలుగు సిల్వర్ మెడల్, మూడు బ్రాంజ్ ఉన్నాయి. రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సీహెచ్ వేణుగోపాలరావు, ఉషు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జి.శ్రీనివాసరావు అభినందించారు.

హత్యకేసులో ఐదో నిందితుడి అరెస్టు



ఐదో నిందితుడిని విలేకరుల ఎదుట హాజరుపర్చిన డీఎస్పీ ఏఎస్ చక్రవర్తి

రాజాం సిటీ: మండల పరిధి కొత్తపేట వద్ద శనివారం జరిగిన తెర్లాం మండలం ఉద్దవోలు గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు ఏగిరెడ్డి కృష్ణ హత్యకేసులో ఇప్పటికే నలుగురిని అరెస్టుచేయగా పరారీలో ఉన్న ఐదో నిందితుడిని కూడా అరెస్టు చేశామని చీపురుపల్లి డీఎస్పీ ఏఎస్ చక్రవర్తి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన స్థానిక పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఉపాధ్యాయుడు కృష్ణ హత్య అనంతరం తప్పించుకునే క్రమంలో మరడాన గణపతి (ఎ-5) పరారయ్యాడని చెప్పారు. పరారీలో ఉన్న గణపతిరావు సోమవారం రాజాం వచ్చినట్లు సమాచారం తెలియడంతో సీఐ రవికుమార్ సిబ్బంది సహాయంతో పట్టుకుని అరెస్టు చేశారని, నిందితుడిని కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

టాటా మ్యాజిక్‌లకు పన్ను రద్దు చేయాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన చేస్తున్న టాటా మ్యాజిక్ పాసింజర్ వాహనాల డ్రైవర్లు

- కలెక్టరేట్ ఎదుట నిరసన

విజయనగరం అర్బన్: భారీగా పెంచిన ట్యాక్స్, థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్‌ను వెంటనే రద్దు చేయాలని విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల జిల్లా టాటా మ్యాజిక్ వ్యాన్‌ల డ్రైవర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏపీ ఆటో మోటార్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పట్టణ వీధుల్లో ర్యాలీ చేపట్టారు. స్థానిక అమర్ భవన్ నుంచి ప్రారంభమైన ర్యాలీ ఆర్టీసీ కాంప్లెక్స్, పోలీసు బ్యారెక్స్ మీదుగా కలెక్టరేట్ వరకు నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ఏఐటీయుసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్, జిల్లా మోటార్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎస్.రంగరాజు, ఏపీ ఆటో మోటార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి, స్టాండ్ అధ్యక్షుడు పాలూరి ఈశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి అప్పారావు, వివిధ మండలాల నుంచి డ్రైవర్లు పాల్గొన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్పించాలి

రజకులను ఎస్సీ జాబితాలో చేర్పించాలని జిల్లా రజక సమాఖ్య సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సమాఖ్య అధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ ఎదుట సోమవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో సభ్యులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ చాకిరేవు స్థలాల ఆక్రమణ జరగకుండా ప్రభుత్వ రికార్డుల్లో నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షుడు గుర్జాపు సత్యారావు, కార్యదర్శి మద్ది పైడిరాజు, కార్యనిర్వాహక అధ్యక్షుడు కోనాడ పైడిచిట్టి తదితరులు పాల్గొన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను నిషేధించాలి ఆన్‌లైన్ మోసాలను కారణమవుతున్న, బెట్టింగ్ యాప్‌లను ప్రభుత్వం నిషేధించాలని ఏఐవైఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ యువత ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లతో మోసపోతున్నారని అటువంటి యాప్‌లను వెంటనే నిషేధించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ నాగలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బూర వాసు, సభ్యులు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తోటపల్లి కాలువల ఆధునికీకరణ నిలిపివేత

- ఈ ఏడాది నవంబర్ వరకు నీరు సరఫరాకు చర్యలు
- డిసెంబర్‌లో మళ్లీ ఆధునికీకరణ చేపట్టేందుకు ప్రణాళికలు



ఇటీవల పూర్తయిన ఎడమకాలువలోని లైనింగ్ పనులు

వీరఘట్టం: పార్వతీపురం మన్యం జిల్లాలోని ఆయకట్టుతో పాటు శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోని సుమారు 64 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తున్న తోటపల్లి ప్రాజెక్టు పరిధిలో ఉన్న పాత ఆయకట్టు కాలువల ఆధునికీకరణ పనులకు తాత్కాలికంగా బ్రేకులు పడ్డాయి. రూ.193 కోట్లతో చేపట్టిన ఈపనులు ఇంత వరకు 48 శాతం పూర్తయ్యాయి.ఈ ఏడాది ఖరీఫ్‌కు ఈ నెల 20న సాగునీరు విడుదల చేయనుండడంతో రెండు రోజుల క్రితం కాలువ పనులను నిలిపివేశారు. ఈ ఏడాది నవంబర్ వరకు సాగునీటి పంపిణీ చేపట్టి అనంతరం డిసెంబర్‌లో మళ్లీ కాలువల ఆధునికీకరణ పనులు చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

తోటపల్లి పాత ఆయకట్టు కాలువల ఆధునికీకరణ పనులను 2019లో జరిగిన ఎన్నికల ముందు టీడీపీ ప్రభుత్వం ప్రారంభించింది.పనులు చేపట్టిన వెంటనే నిలిపివేసింది. తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తోటపల్లి కాలువల ఆధునికీకరణ పనులపై దృష్టి సారించింది. 37.536 కి.మీ పొడవున్న ఎడమకాలువలో ఇంత వరకు 16.843 కి.మీ వరకు కాంక్రీట్ పనులు పూర్తయ్యాయి.అలాగే 17.616 కి.మీ పొడవున్న కుడికాలువలో 9.376 కి.మీ వరకు కాంక్రీట్ పనులు చేపట్టారు.మొత్తం 55.152 కి.మీలకు గాను ఇంతవరకు 48 శాతం అంటు 26.919 కి.మీ మేరకు పనులు పూర్తయ్యాయి.

20న సాగునీరు విడుదల..

తోటపల్లి పాత ఆయకట్టు కాలువలకు ఈనెల 20న సాగునీటిని విడుదల చేసి నవంబర్ నెలాఖరు వరకు పంపిణీ చేయనున్నారు. అంతేకాకుండా ఎడమకాలువలో పెద్దబుడ్డిడి వద్ద ఉన్న బ్రిటిష్ కాలం నాటి పురాతన కట్టడం సైఫన్‌కు బదులు 100 మీటర్లు పొడవునా ఆక్విడెక్ట్ నిర్మాణాన్ని వచ్చే ఏడాది జనవరిలో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నారు.

2024లో పనులు పూర్తి

ఈ ఏడాది కాలువల ఆధునికీకరణలో భాగంగా లైనింగ్ పనులతో పాటు ఆక్విడెక్ట్‌లు, అవసరమైన ప్రతి చోట బ్రిడ్జి నిర్మాణం చేపట్టాం.పెద్దబుడ్డిడి వద్ద ఉన్న సైఫన్‌తో పాటు మిగులు పనులు 2024 చివరి నాటికి పూర్తిచేసేలా ప్రణాళికలు సిద్ధం చేశాం. ఈ ఏడాది ఖరీఫ్‌కు ఎటువంటి ఇబ్బంది లేకుండా 20న నీటి విడుదల చేసేందుకు ముహూర్తం ఖరారు చేశాం.

దమలపాటి రవికుమార్,
డీఈఈ, పాలకొండ డివిజన్

బంగారు గొలుసు చోరీ

బొబ్బిలి: పట్టణంలోని సంతోషిమాత ఆలయానికి వెళ్లేందుకు నడిచి వెళ్తున్న స్థానికురాలైన అల్లు సరోజిని మెడలోని బంగారు గొలుసును తెంచుకుని పోయాడో యువకుడు. స్థానిక రాజ్‌మహల్ కాలనీలో నివసిస్తున్న ఆమె అక్కడి నుంచి ఫ్లైఓవర్ కింది రోడ్డులో నడిచి వెళ్తోంది. లారీ యూనియన్ కార్యాలయం సమీపంలో హఠాత్తుగా ఓ యువకుడు ఆమె వద్దకు వచ్చి మెడలో చైన్‌ను తెంపేయడంతో వెంటనే కింద పడిపోయింది. దీంతో మెడపై స్వల్ప గాయాలు కాగా వెంటనే ఆమెకు ప్రథమ చికిత్స చేయించారు. చైన్ తెంచుకుపోయిన యువకుడిని పట్టుకునేందుకు పోలీసులు సీసీ పుటేజీలు పరిశీలిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్సై భాగ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఊర్లోనే ఉపాధి భద్రత

- వలసలు తగ్గుముఖం
- అంబుడ్స్‌మన్ విశాఖ, విజయనగరం జిల్లాల అధికారి



మాట్లాడుతున్న అంబుడ్స్‌మన్ అధికారి అన్నపూర్ణ

రామభద్రపురం: ఉపాధిహామీ పథకం ద్వారా వేతనదారులకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సొంత ఊర్లోనే ఉపాధి భద్రత కల్పిస్తున్నాయని అంబుడ్స్‌మన్ విశాఖపట్నం,విజయనగరం జిల్లాల అధికారి శతపతి అన్నపూర్ణ అన్నారు. ఈ మేరకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం ద్వారా చేపడుతున్న పనులు ప్రజలు, రైతులకు ఉపయోగపడేలా పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. ఉపాధిహామీ పనులు, జాబ్‌కార్డులు, ఫిర్యాదులు, గ్రామ సభలు, పనుల డిమాండ్, మెటీరియల్, ఆస్తుల రికార్డులు తప్పనిసరిగా నిర్వహించాలని స్పష్టం చేశారు. ఉపాధిహామీ సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. గతంలో జీవనోపాధి కోసం పొరుగు ప్రాంతాలకు పరుగులు పెట్టిన వలస జీవులకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల చర్యలతో ఆ పరిస్థితి తప్పిందన్నారు. ఉపాధి పనుల కల్పనలో దేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రథమ స్థానంలో నిలవగా రాష్ట్రంలో విజయనగరం జిల్లా ప్రథమ స్థానంలో నిలవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమామణి పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి..

- ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్ రాహుల్‌దేవ్ శర్మ



పోలీస్ సిబ్బంది పిల్లలను సన్మానిస్తున్న కమాండెంట్ రాహుల్‌దేవ్‌శర్మ, తదితరులు

డెంకాడ: బెటాలియన్ పోలీస్ సిబ్బంది పిల్లలు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని చింతలవలస ఐదో ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్ రాహుల్‌దేవ్ శర్మ అన్నారు. ఉన్నత విద్య అభ్యసిస్తున్న బెటాలియన్ పోలీస్ సిబ్బంది పిల్లలను సోమవారం స్థానిక యూనియన్ ఫంక్షన్ హాల్‌లో అభినందించి, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలీస్ సిబ్బంది రాత్రి, పగలు తేడా లేకుండా విధులు నిర్వహిస్తూ, పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దడం గొప్ప విషయమన్నా రు. కార్యక్రమంలో అడిషినల్ కమాండెంట్ సీహెచ్‌వీఎస్ పద్మనాభరాజు, అసిస్టెంట్ కమాండెంట్లు బి.శ్రీనివాసులు, డి.మురళీకుమార్, బెటాలియన్ పోలీస్ అధికారులు, మినిస్టీరియల్ ఉద్యోగులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురికి గాయాలు



చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

పార్వతీపురం: జియ్యమ్మవలస మండలం తుంబలి-అల్లువాడ గ్రామాల పరిధిలోని రహదారిలో మలుపు వద్ద ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న సంఘటనలో ముగ్గురు గాయాలపాలయ్యారు. సోమవారం జరిగిన ఈ ప్రమాదంపై పార్వతీపురం అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బీజేపురంనుంచి దాసరిపేట ద్విచక్రవాహనంపై వెళ్తున్న పిరిడి వినయ్‌కుమార్..ఎదురుగా ద్విచక్ర వాహనంపై వస్తున్న గడసాపు సిద్ధు, ప్రభుకుమార్‌లు ఢీ కొన్నారు. ఈ ప్రమాదంలో రెండు బైక్‌లపై ఉన్న ముగ్గురికీ గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను 108 వాహనంలో చినమేరంగి ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్సకోసం తరలించి ప్రథమ చికిత్స అంతనం మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తీసుకువచ్చారు.

అంట్లవారలో ఏనుగుల సంచారం

- భయాందోళనలో గ్రామస్తులు
- ప్రజలను అప్రమత్తం చేసిన అటవీశాఖ అధికారులు



అంట్లవార పొలాల్లో తిరుగుతున్న ఏనుగు

తెర్లాం: మండలంలోని లింగాపురం పంచాయతీ అంట్లవార గ్రామానికి సమీపంలోని పంట పొలాల్లో ఏనుగులు సంచరిస్తున్నాయి. కట్టిజనుము పొలంలో నుంచి సోమవారం బయటకు వచ్చిన ఒక ఏనుగును చూసిన రైతులు భయాందోళన చెందారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ బూరాడ తవిటినాయుడు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఏనుగుల ట్రాకర్లను పంపించారు. ప్రజలెవ్వరూ పొలాల్లోకి, ఏనుగులు సంచరించే ప్రదేశం వైపు వెళ్లవద్దని లింగాపురం, అంట్లవార గ్రామాల్లో వీఆర్‌ఏ దండోరా వేశారు. ఏనుగుల గుంపు గ్రామంలోకి చొరబడకుండా చర్యలు తీసుకుంటామని అటవీశాఖ డీఆర్‌ఓ విజయకుమార్ తెలిపారు. ఏనుగులను ఎవ్వరూ కవ్వించవద్దన్నారు.

21న మెగా జాబ్ మేళా

పార్వతీపురం: పార్వతీపురం శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 21న మెగా జాబ్ మేళా నిర్వహిస్తామని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో జాబ్‌మేళా పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో యువతకు ఉపాధి కల్పనలో భాగంగా 19 కంపెనీల ప్రతినిధులు జాబ్‌మేళాకు హాజరై ఉద్యోగాలకు ఎంపిక చేస్తారన్నారు. పదోతరగతి నుంచి పీజీ వరకు, బీటెక్, ఎంబీఏ చదివిన అభ్యర్థులు తమ వివరాలను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్ వెబ్‌సైట్‌లో పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ 63051 10947, 63034 93720, 79937 95796 నంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్, డీఆర్‌ఓ జె.వెంకటరావు, డీఆర్‌డీఏ పీడీ పి. కిరణ్‌కుమార్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.